క్లుప్తంగా

ఎస్‌ఐ అభ్యర్థుల ఆందోళన



మానవహారంగా ఏర్పడిన ఎస్‌ఐ పరీక్షలకు ప్రిపేరవుతున్న అభ్యర్థులు

విజయనగరం క్రైమ్: ఎస్‌ఐ పరీక్షలకు ప్రిపేరవుతున్న అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ అభ్యర్థులు మంగళవారం కోట జంక్షన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. పోలీస్ ఎస్‌ఐ మెయిన్స్ పరీక్షలకు సన్నద్ధం కావడానికి రెండు నెలల గడువు ఇవ్వాలని కోరారు. ఇప్పటికిప్పుడు పరీక్షలంటే అభ్యర్థులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. అధికారులు స్పందించి తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. అనంతరం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో అభ్యర్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు

విజయనగరం ఫోర్ట్: జీతాలు ఇప్పించాలని కోరుతూ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బకాయి ఉన్న 3 నెలలు జీతాలను తక్షణమే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో అశోక్, నాయుడు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి బెడ్ వితరణ



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి బెడ్ అందజేస్తున్న మజ్జి సిరిసహస్ర

విజయనగరం: జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి చిన్న శ్రీను సోల్జర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు మజ్జి సిరి సహస్ర మంగళవారం బెడ్‌ను అందించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందేందుకు వచ్చే వారికోసం తన తాతయ్య దివంగత మజ్జి నర్సింగరావు జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆమె తెలిపారు. అనంతరం సిరి సహస్ర ఆస్పత్రిలో పలు వార్డులలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి వైద్య సిబ్బందితో మాట్లాడి రోగులకు అవసరమైన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు.


విజేతలకు బహుమతులు



మెగా హౌసీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న రమేష్

విజయనగరం టౌన్: వినాయక చవితి పర్వదినం పురస్కరించుకుని వాజీ చానెల్ నిర్వహించిన మెగా హౌసీ విజేతలకు బహుమతులు మంగళవారం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏటా వివిధ సందర్భాల్లో మెగా హౌసీ నిర్వహించడమే కాకుండా, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ, సంక్రాంతి సందర్భంగా రంగోలీని నిర్వహించి అందరి మన్ననలు వాజీ పొందుతుందన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. మెగా హౌసీ విజేతలుగా నిలిచిన నాగకుమారి, కృష్ణారావు, శివ, వరలక్ష్మి, హిమబిందు, కె.నారాయణమ్మ, దివ్య, సంధ్య, అంకిత్, సంధ్య పాల్గొన్నారు.

తెలగ కులస్తులను బీసీలో చేర్చాలి



సమావేశంలో పాల్గొన్న తెలగ సంఘం నాయకులు

పూసపాటిరేగ : తెలగ కులస్తులను బీసీలో చేర్చాలని తెలగ సంఘం నాయకులు పీవీ రామారావు అన్నారు. మండలంలోని చింతపల్లి గ్రామంలో 30 గ్రామాలకు చెందిన తెలగ కులస్తులు పార్టీలకు అతీతంగా సమావేశమయ్యారు. ఉత్తరాంధ్రలో తెలగ కులస్తులు ఆర్థికంగా వెనకబడి వున్నందున బీసీలోకి మార్పు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అల్లాడ రమేష్, పుప్పాల లక్ష్మీనారాయణ, ఆకిరి ప్రసాదరావు, పసపులేటి గోపి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- రూ.30 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్ ప్రారంభం
- పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్ విజయలక్ష్మి



నూతన బీటీ రోడ్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్

విజయనగరం: కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో ప్రధాన రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించటం జరిగిందని, పైడితల్లమ్మవారి జాతర సమయానికి ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి పేర్కొన్నారు. నగరంలోని దాసన్నపేట కాళీమాత ఆలయం జంక్షన్ నుంచి ఎఫ్‌సీ గోదాములు మీదుగా ఏర్పాటు చేసిన బీటీ రోడ్డును డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజావసరాలకు అనుగుణంగా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సమకూర్చుతున్నారన్నారు. ఇప్పటికే నగరంలో ప్రధాన రహదారులు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. అందరి సమష్టి కృషితో అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దుదామని ఆకాంక్షించారు. రూ.30 లక్షలతో కాళీమాత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన రహదారి వల్ల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. గతంలో గతుకులమయంగా ఉండే రహదారిని నూతనంగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరిన వెంటనే డిప్యూటీ స్పీకర్ స్పందించి అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టారన్నారు. 6, 7 డివిజన్‌ల కార్పొరేటర్‌లు పొంతపల్లి మాలతి, ఆల్తి సత్యకుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిరాటంకంగా సాగుతున్నాయన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రత్యేక దృష్టితో తమ డివిజన్‌లో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. గతంలో తాగునీటికి అనేక ఇబ్బందులు ఎదుర్కొనే వారిని ప్రస్తుతం రోజు విడిచి రోజు తాగునీటి పంపిణీ జరగడంతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జిలు కోలగట్ల కృష్ణారావు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ సంగంరెడ్డి బంగారు నాయుడు, బొద్దాన అప్పారావు, మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, ఆల్తి శ్రీనివాసరావు, పొంతపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే నగరాభివృద్ధి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగరాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కార్పొరేషన్ కాంట్రాక్టర్లకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. కార్పొరేషన్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నేతృత్వంలో కార్పొరేషన్ కార్యాలయ షాపింగ్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామిని కార్పొరేషన్ కాంట్రాక్టర్ల సంఘం ఘనంగా సత్కరించింది. కార్యాలయ ప్రారంభోత్సవం అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ అందరి సమష్టి సమన్వయంతో అభివృద్ధి సాధ్యమన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఉత్సాహంగా అభివృద్ధి పనులు పూర్తిచేసి నగరాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దే క్రమంలో కాంట్రాక్టర్ల పాత్ర కీలకమని అన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాంట్రాక్టర్లను ఆదుకునే రీతిలో కృషి చేస్తున్నామన్నారు. నగరం అభివృద్ధి చెందితే ఆ పేరు తన ఒక్కడికే కాకుండా నగర ప్రజలందరికీ వస్తుందన్న విషయాన్ని స్పష్టం చేశారు. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ పొరుగునున్న విశాఖపట్నానికి దీటుగా మన నగరం కూడా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ.రాజేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, కార్పొరేషన్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బండారు బంగార్రాజు, విశాఖపట్నం అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమౌళి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం రూరల్: యువత విద్య, క్రీడలు, రాజకీయ, వ్యాపార రంగాల్లో రాణించాలని రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. పట్టణంలోని లీ ప్యారడైజ్ కన్వెన్షన్ హాలులో 'జివిజ్' కమర్షియల్ యాప్ ఆవిష్కరణకు మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజల వ్యాపార అవసరాల తీర్చేందుకు ముగ్గురు యువకులు రూపొందించిన జివిజ్ యాప్‌తో మెరుగైన సేవలు అందించి వారి మన్ననలు పొందాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో నగర మేయర్ వి.విజయలక్ష్మి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తనయ మజ్జి సిరి సహస్ర, ప్రముఖ వ్యాపారవేత్త కాపుగంటి ప్రకాష్, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌కి వెళ్లి పింఛన్ అందజేత

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పెద బూరాడపేట గ్రామానికి చెందిన వలంటీర్ ఆవాశ మౌనిక మంగళవారం విశాఖపట్నం వెళ్లి లబ్ధిదారుకు పింఛన్ అందజేశారు. గ్రామానికి చెందిన అంధ దివ్యాంగుడు రమణ కొంత కాలంగా విశాఖ కేజీహెచ్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో వలంటీర్ మౌనిక ఆస్పత్రికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు.



ఆస్పత్రిలో బయోమెట్రిక్ వేయిస్తున్న వలంటీర్

వేరుశనగలో సస్యరక్షణ తప్పనిసరి



వేరుశనగ పంటపై రైతులకు సూచనలిస్తున్న ప్రధాన శాస్త్రవేత్త తేజేశ్వర్రావు

పూసపాటిరేగ : వేరుశనగలో సస్యరక్షణ తప్పనిసరి అని ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త కె.తేజేశ్వర్రావు అన్నారు. మండలంలోని పసపాం గ్రామంలో వేరుశనగ సాగును మంగళవారం పరిశీలించి రైతులకు సూచనలు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ వేసే ప్రతి రైతు ఎరువులతో పాటు కలుపు తీసే సమయంలో జిప్సం వేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.నీలిమ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం దిశగా విద్యార్థులు పయనించాలి

విజయనగరం క్రైమ్: విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యం దిశగా పయనించాలని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు కోరారు. స్థానిక అపెక్స్ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు, సైబర్ మోసగాళ్లు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ మోసాలకు, వేధింపులకు గురైతే 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామగణేష్, అపెక్స్ ప్రిన్సిపాల్ నిజాముద్దీన్, వన్‌టౌన్ పోలీసులు, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు

అంగన్‌వాడీల ద్వారా మెరుగైన సేవలు



రామతీర్థంలో పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా మెరుగైన పౌష్టికాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని రామతీర్థం ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను మంగళవారం తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు కేంద్రాలకు రాకుండా నేరుగా ఇంటికే పౌష్టికాహారాన్ని పంపిణీ చేసే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాశినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీను, సర్పంచ్ కంచరాపు సూర్యకళ, సూపర్‌వైజర్ ఆల్తి జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్ అనుకూల చట్టాల రద్దుకు డిమాండ్



కలెక్టరేట్ ఎదుట నిరసనలో రైతులు, కార్మికులు

విజయనగరం అర్బన్: రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల వ్యవసాయ చట్టాలు రద్దు చేయాలని కిసాన్ మోర్చా, రైతు, కార్మిక సంఘాల సంయుక్త సమన్వయ కమిటీ డిమాండ్ చేసింది. ఉత్తరప్రదేశ్‌లో రైతులపై జరిపిన కాల్పుల నేపథ్యంలో ప్రధాని మోదీ ఇచ్చిన లిఖిత పూర్వక హామీలను అమలు తాత్సారం చేస్తున్నందుకు చేస్తున్న దేశ వ్యాప్త ఉద్యమానికి మద్దతుగా స్థానిక కలెక్టరేట్ ఎదుట బ్లాక్ డే నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సోమనాథన్ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా ఉత్పత్తి ఖర్చుకి అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించి చట్టం చేసి ప్రభుత్వమే కొనాలని డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేటాయించే బడ్జెట్ కోత విధించుకున్న నిధులు ఇవ్వాలని డిమాండ్ చేసారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా కన్వీనర్ బి.రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు కె.సురేష్‌బాబు, జి.శ్రీనివాస్, దేగల అప్పలరాజు, రాకోట రాములు, అప్పారావు, ఎ.జగన్‌మోహన్, బి.రమణ, ఎస్.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ విద్యా సంస్థల్లో మిగులు సీట్ల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఉపాధి మరియు శిక్షణ శాఖ ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ గిరి తెలిపారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో కంప్యూటర్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానికల్ గ్రేడ్‌లందు మాత్రమే సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 7వ తేదీ రాత్రి 11.59 గంటల వరకు దరఖాస్తులను 'ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 8న మధ్యాహ్నం 12 గంటలోపు ఏదైనా ప్రభుత్వ ఐటీఐ నందు తప్పనిసరిగా ధ్రువపత్రాలను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 9న ప్రభుత్వ ఐటీఐలలో కౌన్సెలింగ్, ఈ నెల 10న ప్రైవేటు ఐటీఐలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. అభ్యర్థి ఒక ఐటీఐ కన్నా ఎక్కువగానూ, ఏ జిల్లాలో అయిన దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సబ్మిట్ చేసిన దరఖాస్తును జెనరేట్ అయిన అన్‌క్యూ నంబర్‌తో కూడిన ప్రింట్ అవుట్‌ను అభ్యర్థులు అడ్మిషన్ టైమ్‌లో సమర్పించాలని సూచించారు.

టెన్త్ ఫెయిలైన విద్యార్థులకు పరీక్ష ఫీజు గడువు పెంపు

విజయనగరం అర్బన్: పదో తరగతి ఫెయిలై ప్రైవేటుగా పరీక్షలు రాయనున్న, మైగ్రేషన్ సర్టిఫికెట్ కావాలన్న విద్యార్థులకు ఫీజు గడువును పొడిగించినట్లు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి మంగళవారం తెలిపారు. తాజా షెడ్యూల్ ప్రకారం ప్రధానోపాధ్యాయుని స్థాయిలో ఫీజు చెల్లించడానికి ఈ నెల 10 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. అదే తేదీలోగా నామినల్ రోల్స్, ఇతర డాక్యుమెంట్స్ ఆన్‌లైన్‌లో సమర్పించాలని తెలిపారు. ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు రూ.50, ఈ నెల 17 నుంచి 23వ తేదీ వరకు రూ.200, ఈ నెల 24 నుంచి 30 తేదీ వరకు రూ.500 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించవచ్చని సూచించారు. మూడు సబ్జెక్టుల వరకు పరీక్షకు రూ.110, మూడు సబ్జెక్టులు కన్నా ఎక్కువ రాసిన వారు రూ.125, మైగ్రేషన్ సర్టిఫికెట్ రూ.80 ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ఫీజును 'బీఎస్ఈ.ఈపీ.జీఓవీ.ఐఎన్' వెబ్ సైట్‌లో స్కూల్ లాగిన్‌లో మాత్రమే చెల్లించాలని తెలిపారు. సీఎఫ్ఎంఎస్‌లో బ్యాంకు చలానాలు అనుమతిలేదని ప్రధానోపాధ్యాయులు గుర్తించాలని సూచించారు.

వినాయక అనుపోత్సవం



ఊరేగింపులో వినాయక విగ్రహం

విజయనగరం జిల్లా కేంద్రంలో గణపతి నవ రాత్రులు అంగరంగ వైభవంగా జరుపుకున్న పట్టణ వాసులు సోమవారం రాత్రి వినాయక విగ్రహాలతో పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. వినాయక ప్రతిమల అనుపోత్సవం చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



సీకేఎం జూనియర్ కళాశాలలో మొక్కలు నాటుతున్న మజ్జి సిరి సహస్ర

నెల్లిమర్ల: జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర వరల్డ్ నేచర్ డే సందర్భంగా స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మొక్కల పెంపకంపై మంగళవారం అవగాహన కల్పించారు. స్థానిక యాజమాన్యంతో కలిసి పలు రకాల విత్తనాలు గురించి తెలుపుతూ వాటిని నాటారు. అనంతరం విద్యార్థులతో కలిసి పర్యావరణ రక్షణకు చెట్లు పెంచడం అవసరమని, గో గ్రీన్ బ్రీత్ క్లీన్ అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మధుసూదనరావు, సిబ్బంది లెంక సంధ్య, రమణ, అప్పారావు, చంద్రశేఖర్, రఘు పెస్ట్ కంట్రోల్ జగదీష్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఊరూ.. వాడ 'జగనన్న ఆరోగ్య సురక్ష'



నెల్లిమర్ల రూరల్: రామతీర్థంలో జగనన్న ఆరోగ్య సురక్ష మందుల కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ప్రజారోగ్యమే ప్రథమ కర్తవ్యంగా భావిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభించారు. ఊరూ... వాడ అంతటా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి తమ ఆరోగ్యాన్ని పరీక్షించుకుంటున్నారు. అవసరమైన మందులను అందుకుంటున్నారు. మా ఆరోగ్యానికి జగనన్న భరోసా ఇస్తున్నారని ప్రజలు సంబరపడుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



డెంకాడ: మోదవలసలోని వైద్య శిబిరంలో రోగులకు మందులను అందజేస్తున్న ఎంపీపీ వాసుదేవరావు



విజయనగరం రూరల్: రోగులతో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు



నెల్లిమర్ల: కార్యక్రమంలో కళ్లద్దాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, డీఎంహెచ్‌ఓ భాస్కరరావు తదితరులు



భోగాపురం: ముక్కాంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మందులు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

తెలంగాణ టెట్ ర్యాంకర్‌కు ఘన సత్కారం

విజయనగరం అర్బన్: తెలంగాణ ప్రభుత్వ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) – 2023లో రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంక్ సాధించి ప్రతిభ చూపిన కొలుసు అప్పలరాజును స్థానిక తోటపాలెం సాయి గాయత్రి డీఎడ్ కళాశాలలో మంగళవారం కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అల్లు ఆదినారాయణ, డాక్టర్ ఎస్.శ్రీనివాసమోహన్, అధ్యాపక బృందం పాల్గొని అభినందించారు.

ప్రజలకు సంక్షేమం, అభివృద్ధిని వివరించాలి

- ఎమ్మెల్యే బడ్డుకొండ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ : గడిచిన నాలుగున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని గడప గడపకు వెళ్లి కార్యకర్తలు వివరించాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, నియోజకవర్గం పరిశీలకుడు అంధవరపు సూరిబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంపై పూసపాటిరేగ మండల వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో విస్తృతస్థాయి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి ఇంటింటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పాలన వివరిస్తూ, వారి అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. సచివాలయం కన్వీనర్లు, గృహసారథులను సమన్వయం చేసుకొని వెళ్లాలన్నారు. ఆ సచివాలయం పరిధిలో ఒక రాత్రి నిద్ర చేయాలన్నారు. రాష్ట్రానికి జగన్ నాయకత్వం ఎందుకు అవసరమో వివరించాలన్నారు. భోగాపురంలో మిరాకిల్ సంస్థ వందల ఎకరాలు ప్రభుత్వ భూమిని మింగేసిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, దాడిశెట్టి త్రినాధరావు, అల్లాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయనగరం
9951602843
Office mail : vzmadvt@gmail.com